సంక్రాంతి శంఖం

ఇవి చిన్ననాటి ముచ్చట్లు. హేమంతం జరుగుతుండగా ఒకానొకనాటి వుదయం నిద్రలేచి కళ్ళు నులుముకుంటూ యింటి ముంగలికి వచ్చేసరికి గడపముందర వీధిలో రంగవల్లికల్లో పేడముద్దల పైన గుమ్మడి పువ్వులు కనిపించేవి. అవి కనబడగానే పండుగనెల ప్రారంభమైందనుకునేవాళ్ళం. ఆ రోజు సాయంత్రానికల్లా మావాడ పసుచులు వాల్జడల్లో చేమంతులు నవ్వుతుండగా గొబ్బెమ్మను తట్టలో తంగేడుపువ్వుల్లో కూచోబెట్టి గ్రామసంచారానికి బయల్దేరేవారు. మగపుట్టుక పుట్టీ, సంకురాత్రి సంబరాన్నంతా దోచుకునేందుకులా బయల్దేరే ఆడపిల్లల్ని చూస్తూ వూరుకోలేక వాళ్ళవెంట మేమూ బరాబరులు తిరిగేవాళ్ళం. మేము గడుగ్గాయి కుర్రాళ్ళమనీ, నోరూ వాయీ లేని ఆడబిడ్డల్ని ఏడిపించుక తింటామని

మధురాంతకం రాజారాం

ఊళ్ళో ఒక అపప్రథ వుండేది. ఇలా మమ్మను రాంద్రని వెనకేసుకొచ్చే తాతయ్యల్ని చూచి మేము ఏ మాత్రం భయపడేవాళ్ళం కాము. అమాటకొస్తే "చస్తేచేస్తారు! పండుగలొచ్చేదెందుకు? పిల్లలు అల్లరి చేయడానికి కాకపోతే" అని అంగరక్షకుల్లా నిలబడ్డానికి మాకూ కొందరు హేమాహేమీలు లేకపోలేదు. అలా మమ్మల్ని వెనకేసుకొచ్చే వాళ్ళందరూ మా నాయనమ్మలేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటాను. మగవాళ్ళు ఆడవాళ్ళపైన, ఆడవాళ్ళు మగవాళ్ళపైన అభిమానం చిలికించడం ప్రకృతి సహజమని నాకప్పుడు తెలియదు.

ఋతువర్ణనల్ని ఆసక్తితో చదివేవాళ్ళకి తెలుగు కవులకి వసంతంపైన్నే గాక, హేమంతంపట్ల గూడా మమకారం లేకపోలేదని అవగతమౌతుంది. తులసీ ముగ్గులో దివ్వెలా సాలీడుగూటిపై వలికే హిమకణాన్ని చూచి, అకురాలుటను పొతచీర విప్పడానికి ముందు మంచులో తానమాడు తరుపాలిని చూచి, మద కౌశికృతికి తుమ్మెద సోమపీథికై అవనికి దిగివచ్చినట్టి తంభలా వున్న గుమ్మడిపువ్వును చూచి కవులు హేమంత ఋతుసీమంతిని అందం అనుపమమని తలపోశారు. ఔనేమో! హేమంతం అందమైన ఋతువే కావచ్చు. కానీ గులాబీకి ముళ్ళుంటాయి. హేమంతంలో చలి జనాన్ని వేపుకతింటుంది. అందులోనూ మాది కొండకోనలమధ్య బిక్కు బిక్కుమంటుండే పల్లెటూరు కావడంచేత, ఎముకల్ని కొరికివేసే చలితాలూకు భయానక స్వరూపం మాకయినట్టు మరొకరికి అర్థం కాదు. పట్టణాలకి వెళ్ళినప్పుడు, మావూరు ప్రకృతిమాత ఒడిలో గారాబు బిడ్డ అని మేము సగర్వంగా చెప్పుకునే మాట నిజమే! ఐతేనేం! అలా చెప్పడంచేత మా వూళ్ళో చలిబాధ లేదన్న భావం సూచింపబడదు గదా!

ఆ రోజుల్లోనేమి, ఈరోజుల్లోనేమి మా వూళ్ళో చలిబాధ ఎదుర్కోడానికి రెండంటే రెండు పద్ధతులుమాత్రం వున్నాయి. మా వూరు పల్లెటూరని ముందే చెప్పాను. ఉన్న నలభై యిళ్ళలో కలిగినవాళ్ళవి నాలు

జంగందేవరలు

—ఫొటో: పి. ఎస్. ఎస్. [illegible]

గైదు పెంకుటిళ్ళు తప్పితే, మిగిలినవన్నీ పూరిళ్ళు, తాటాకుపాకలు. కలిగినవాళ్ళకు పెంకుటిళ్లు ఎలాగైతే వున్నాయో, అలాగే దుప్పట్లు, శాలువలుకూడా వుంటాయి. వాటిలో ఒళ్లు ముడుచుకొని ఇనప్పెట్టె ల్లాంటి గదుల్లో నిద్రపోవడానికి హేమంతంలో వాళ్లు అలవాటు పడిపోతారు. కానీ పాకల్లో వున్నవాళ్లగతి? వాళ్లు అర్ధరాత్రి నుంచీ పొద్దు కరకర పొడిచేవరకూ, చలిమంటలచుట్టూ కూచుంటారు. చలికాలం రాబోతుందనగా, పెంకుటిళ్ళవాళ్ళకు కొన్ఫూరు శాలువలు, నారాయణవనం దుప్పట్లు అవసరమైతే, పాకల్లోవాళ్ళకి కందికంపలు అవసరమయ్యేవి.

మాది పెంకుటిల్లు. ఆ రోజుల్లో మా నాన్నగారు నాకొక చిన్న శాలువకూడా కొని తెచ్చారు. ఐనా నాకు చలిమంట అనగానే ప్రాణం లేచివచ్చేది! ఏ తెల్లవారుఝామునో లేచి చప్పుడులేకుండా తలుపు తీసుకుని కిష్టిగాడి గుడిసెదగ్గరకు వెళ్ళిపోయే వాణ్ణి. నాలుగైదురోజుల్లో, ఈ నా పలాయనంపట్ల ఇంట్లోవాళ్ళకు మరీ శ్రద్ధ ఎక్కువై మాఅన్నయ్య తలుపుదగ్గరే మంచం వేసుకునే వాడు. వాడి అభిప్రాయంప్రకారం చలిమంటదగ్గర కూచోడం ప్రాణాపాయకరం. అందువల్ల ఒళ్ళంతా ఉరపం కలుగుతుంది. కడుపులో మంట బయలుదేరుతుంది. ఇంకా ఏమిటేమిటో కొంపమునిగేంత ప్రమాదాలు సంభవిస్తాయి!

అప్పుడు నేను రెండోతరగతి చదువుతుంటున్నట్టు జ్ఞాపకం. అమ్మ పండక్కి కొనుక్కురావలసిన బట్టలేవో నాన్నగారికి పురమాయిస్తోంది.

"పెద్దబ్బాయి వులెన్ మఫ్లరు కావాలంటున్నాడు. అమ్మాయికి పావడా పైకి దావిణితేండి. మీరూ ఒకజత సేలంపంచలు తెచ్చుకోండి," అంది అమ్మ.

మా అమ్మ అదో తరహామనిషి. అందరికీ తెమ్మంటుంది గానీ, తనకిమాత్రం ఫలానా బట్టలు కావాలని నోరువిడిచి చెప్పదు. మనసులో అనుకుంటుందేమో మరి, నాకు తెలియదు. కానీ మానాన్నగారేమో ఆవిడ మనసులో జొరబడి, అక్కడున్న వివరాలు గ్రహించినట్టు ఆమెకేదో ఒక చీర కొని తెచ్చేసేవారు. ఆశ్చర్యం! "ఇలాటి చీరైతే బాగుంటుందనుకున్నాను. సరిగ్గా అదే తెచ్చారు,"అంటూ ఆమె మెల్లగా నవ్వబోయేది. సరే. అంతాబాగా నేవుంది. అమ్మ ఏచీర తనకు బాగుంటుందని అనుకుంటుందో నాన్నగారికి తెలుసు. కానీ నా సంగతి? నాకు లాగూ చొక్కా తెమ్మని చెప్పనందుకు అమ్మపైన నాకు కోపం వచ్చింది.

"మరి ఈకుర్రవెధవమాట!" అన్నారు నాన్నగారే!

"వాడికేమీ తేవద్దండీ!" అంది అమ్మ.

అమ్మ దొంగా! అదంతా వట్టినాటకం. నాకు తెలియదేమిటి! అమ్మ కావాలనే నన్ను వుడికించడానికి అలా అంటోంది.

"అంతేనండీ కావలసిన బట్టలు. ఇంక నన్ను వెళ్ళనీండి. అవతల పొయ్యిమీద ఎసరు కాగిపోతోంది," అంది అమ్మ.

"మరి ఈయేడుకూడా గురులింగంమాట మరచిపోతే ఎలాగు?" అన్నారు నాన్నగారు.

"అవునవును. అవేవో ఆ నల్లంచు పంచలున్నాయి చూడండి, అవి పట్టుకరాండీ! పాపం, ముసలాడు. ఈసారివస్తాడు. మళ్ళీ వస్తాడో రాడో ఎవరుచూచారు," అంది అమ్మ.

ఎవరీ గురులింగం! నాకాపేరు విన్న జ్ఞాపకం లేదు. మావూళ్ళో ఆ పేరుగల మనిషి లేడు. మా బంధులోకంలో సైతం అలాటివాడొకడున్నట్టు నాకు తెలియదు. అంతగా నాకపరిచితుడైన గురులింగానికి పంచలచాపు బహూకరించవలసిన అవసరంఏమిటి? అమ్మనడుగుదామనుకుంటుండగా, అన్నయ్య వచ్చేశాడు. వాడు ఇంట్లోవున్నంతవరకూ నేను అదేమిటి, ఇదేమిటి అని అమ్మనో, నాన్నగారినో అడిగి సందేహనివృత్తి చేసుకోడానికి వీలుండదు. "వేలెడంత లేవు, అప్పుడే నీకు పెద్దమాటలెందుకురా," అంటూ వతను అప్పటికి తనేమో హిమాలయమంత ఎత్తున్నట్టు!

నాన్నగారు పట్నంనుంచీ క్రొత్తబట్టలతోసహా వచ్చారు. యుద్ధం జరుగుతున్న రోజులు. వెల కాస్త గిరాకిగావున్నట్టు, తీసుకెళ్ళిన డబ్బుగాక, నటకలవారి అంగడిలో పాతిక పైగా బాకీ మిగిలినట్టు చెప్పారు. డబ్బు దుబారాచేయడం అమ్మకుగిట్టదు. "ఐతే ఈ నల్లంచుపంచ లెందుకు తెచ్చారండీ? ఎప్పటిలాగా గురులింగానికి ఒకపాతగుడ్డేయిస్తే సరిపోయేదిగా!" అంది.

నాన్నగారు నివ్వెరపోయినట్టు, "అదేమిటే! వచ్చే ఏడాదికతడు వస్తాడో రాడోనని నిట్టూర్చింది నువ్వేగా! పోనీ తెమ్మన్నావు గనుక తెచ్చాను," అన్నారు.

చుట్టుపట్ల కలయజూచి, అన్నయ్య లేడని నిర్ధరించుకుని, "ఎవరు నాన్నా ఆ గురులింగం" అన్నాను.

"తెలియదంట్రా! పండుగనెల్లో వస్తుంటాడు," అన్నారు నాన్నగారు.

"వాడికేం తెలుసండీ! పోయినసారి గురులింగం వచ్చినప్పుడు, నేను పని గట్టుకుని లేపినా, వీడు గుర్రు పెట్టి నిద్రపోయాడు," అంది అమ్మ.

అప్పుడెప్పుడో గుర్రుపెట్టి నిద్రపోయినందుకు నాకు నాపైన్నే ఇంచుక ఆగ్రహం కలిగింది. అమ్మా, నాన్నా మాటల్ని బట్టి చూస్తే గురులింగం ఎప్పుడంటే అప్పుడు వచ్చే వాడిలా కనిపించడంలేదు. సంవత్సరానికోసారి, అది పండుగనెల్లో వస్తాట్ట! ఎందుకొస్తాడో మరి! ఈసారి గుర్రుపెట్టి నిద్రపోకూడదు, కాదని నిద్రపోయినా, అమ్మ లేచేసరికి లేచి కూచోవాలి. పొద్దు

పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్య గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టు కార్డు పైన నీ కిష్టమగు ఒక పుష్పముపేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీసరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయముకలుగును. నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము. తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, విధివిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభం మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా వున్న యెడల శాంతి చేయు విధానం కూడా తెలుపుట చేయడమగును. వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన భోగటా నీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Swami Satyanarain, Raj Jyotishi, (WPA) Phagwara. (Ph.)



తెల్లవారగ చిట్టితల్లులు
తీర్చిదిద్దిరి రంగవల్లులు

ఫోటో: పసల కృష్ణకుమార్.

గురులింగం! ఆవచ్చేవాడు కాస్తా పగలే రాకూడదూ!

* * *

పడమటి వీధి వెంబడే వెళ్తున్నాం, గొబ్బిదట్టేవాళ్ళ వెంటబడి! 'ఆకొండ ఈ కొండ నల్లంజి కొండ' అని అక్కడ కిష్టిగాడి చెల్లెలు పదమందుకోగానే, ఇక్కడ కిష్టిగాడు ఆపదాన్ని బెంకాయ పీకలో "ఫీ! ఫీ!" మని పలికిస్తున్నాడు. రాముడు ఆపాటకు ఖాళీ కిరసనాయిలుడబ్బాపైన మృదంగం మ్రోగిస్తున్నాడు. నిజం చెప్పొద్దూ! నేను అల్లరి పిల్లల్లో ఒక్కడినైనా, అల్లరి చేసే విద్యలో అంతటి పరాకాష్ఠ నందుకోనివాణ్ని. మేము బుచ్చమ్మగారి ఇంటి ముందర తిష్ఠవేసి, ఏక్ ధమ్మున అల్లరి సాగించేస్తున్నాం. వున్నట్టుండి సభలో కలకలం చల్లారింది. "ఏమిటది, ఏమిటది," అన్నాను.

"అదా! తెలియదూ? శంఖం!" అన్నాడు కిష్టిగాడు.

"శంఖమ?" విస్తుపోయాను.

"అవున్రా! మా అమ్మ చెప్పింది. అది సంక్రాంతి శంఖమట."

ఏం సంక్రాంతో, ఏంశంఖమో దాని వృత్తాంతం సమగ్రంగా తెలుసుకోవాలనిపించింది నాకు. శబ్దం వచ్చినదికకు పరుగెత్తాను. నావెంట పిల్లలు చాలామంది పరుగెత్తి వచ్చారు.

నడివీధిలో జనం ప్రోగయ్యారు. జనసమూహం మధ్యనిలిచి ఒక ముసలాతడు, 'భంభం' అని శంఖధ్వానం చేస్తున్నాడూ.

అతణ్ని చూడగానే నాకు కూ అక్కయ్య నాలుగో తరగతి పుస్తకంలో వున్న త్యాగయ్య బొమ్మ జ్ఞాపకం వచ్చింది. ఆ చిన్నతనంలో అతడే త్యాగయ్యని అనుకున్నానేమో, ఇప్పుడు స్మృతికి రావడంలేదు. పొడవుగా ఒక దుప్పటి అతడి తలపైన్నుంచీ క్రిందికి వ్రేలాడుతోంది. భుజాలకుపైన అదితలతో ఐక్యమై పోయినట్టుండి, క్రిందికి రాను, రానూ వదులుగా వ్రేలాడుతూ, అతడి కది మంచి ఆచ్ఛాదనంగా ఉపకరిస్తోంది. ఫాలభాగంలో, కంఠసీమలో, వీపుంపైనా విభూతిపట్టెలు మెరిసిపోతున్నాయి. మెడలో ఎర్రటి దారానికి నల్లటి శివలింగం వ్రేలాడుతోంది? కుడిచేతితో అతడు గంట కదిలిస్తూ, ఎడమచేతితో శంఖం పైకెత్తి పూరిస్తున్నాడు.

ఆ వృద్ధుడికి ప్రక్కన నాకింకొక అపరిచితుడు కూడా కనిపించాడు. ఇతడు యువ

★ సంక్రాంతి శంఖం ★

కుడు. ఇతడికీ మెడలో శివలింగం వ్రేలాడుతోంది. ఇతడూ గంటవాయిస్తూ, శంఖం పూరిస్తున్నాడు. ఐతే వృద్ధుడిలా ఇతడు దుప్పటి కప్పుకోలేదు. పంచకట్టుకుని, పైన చొక్కా వేసుకున్నాడు. ఎర్రటి తువ్వాలుతో తలగుడ్డ చుట్టుకున్నాడు.

ఆ ఇద్దర్ని చూడగానే, నాకు రెండు నెలల్రకితం మా వూళ్లో జరిగిన సంఘటన ఒకటి జ్ఞాపకం వచ్చింది. గారడీ పనులు చేస్తామంటూ సరిగ్గా ఇలాగే ఒక ముసలివాడూ, ఒక పడుచువాడూ వచ్చినడివీధిలో ఎన్నెన్నో తమాషాలు చేసి చూపెట్టారు. ఐతే వాళ్ళకి మల్లే వీళ్ళు నల్లకోట్లు తొడుక్కుని, చేతులకు తాయెతలుకట్టుకొని, కోర మీసాలపైన మినుకు మినుకుమంటున్న పిల్లికళ్లతో మమ్మల్ని భయపెట్టలేదు. ఎందుకో కారణం చెప్పలేనుగానీ, నాకు వాళ్లెంత చెడ్డవాళ్లుగా కనిపించారో, వీళ్లంత ఆత్మీయులుగా కనిపించారు.

కిష్టిగాడికైతే వీళ్లనిగురించి బాగా తెలిసి వుంటుందని, వాడికోసం జనంలో వెదికాను. వెధవ, ఎక్కడ నక్కికూచున్నాడో కనిపించలేదు. పోనీ, మరెవరినైనా అడుగుదామనుకుంటుండగా, అరుగుపైన్నుంచీ అన్నయ్య, "ఇంకా తిరుగుతున్నావట్రా చదువుకోకుండా" అని కేకవేశాడు. ఇంక అక్కడ వీపు చిట్లించుకోడానికి మనస్కరించక, ఇంటికి జొడుతీశాను. అమ్మ మండువాలో విస్తర్లు కుట్టుకుంటోంది.

"అమ్మా అమ్మా! ఎవరో వచ్చారు. చూద్దుగానిరా" అన్నాను గస బోసుకుంటూ.

"ఎవర్రా? ఆ శంఖం వూదేవాళ్లేనా?" అంది అమ్మ.

"వాళ్లే, వాళ్లే" అన్నాను.

"వాళ్లని నే నెన్నోసార్లు చూచానులే. ఆ ముసలాతణ్ని చూచావుగదా! అతడే గురులింగం!"

"మరి ఇంకొకడు?"

"గురులింగం కొడుకు."

"గురులింగం, గురులింగంఅంటావు. నీకైతే వాళ్లెవరో తెలుసు. నాకేం తెలీడంలేదు." అన్నాను.

అమ్మ నవ్వుతూ, "వాళ్లు జంగాలురా! ప్రతి పండుగనెల్లోనూ, ఇలా ఊళ్లుతిరుగుతూ మనల్ని దీవించిపోతుంటారు." అంది.

దీవించడమంటే ఏమిటో నాకు తెలియదు. బహుశా అదేవో ఘనకార్యమే అయివుంటుంది. లేకుంటే, వాళ్లకి కొత్తపంచలెందుకు సమర్పించుకుంటాము!

వాళ్లు మా ఇంటికెప్పుడొస్తారో అని తెలుసుకుందా మనుకుంటుండగా వాకిట్లో అన్నయ్య ఎవరితోనో మాట్లాడ్డం వినిపించి, చరచరా గదిలోకి పరుగెత్తి, పుస్తకాలు పైకి తీశాను.

ఆరాత్రి తెల్లవారుఝామున గురులింగం పుత్రసమేతంగా మా ఇంటికి వచ్చాడు. అమ్మా నాన్నా దీపం వెలిగించుకుని అతడి కోసం వేచి చూస్తూ కూచున్నారు. వీధిలో నిలబడి గురులింగం ఒకసారి శంఖధ్వానంచేసి ఏదోపాట ప్రారంభించాడు.

"పర్వతాల సాంబశివుడు భద్రేశ్వరా!
వచ్చీ వాకిటనిలిచినాడు భద్రేశ్వరా!"

అమ్మ తలుపు తెరిచింది. గురులింగం లోపలికి వస్తూనే, నాన్నగారిచేతికొక విభూతిపండిచ్చాడు. అమ్మ చాపవేసింది. చాపపైన కూచుంటూ, జంగాలిద్దరూ మళ్లీ పదమందుకున్నారు.

"భాగ్యనోమూ లిచ్చేవాడు భద్రేశ్వరా!
పున్నెపు నోమూ లిచ్చేవాడు భద్రేశ్వరా!
ఓరుగంటి శివశంభుడు భద్రేశ్వరా!
వాలాలాడే వేశలయ్యా భద్రేశ్వరా!"

"భద్రేశ్వరా, భద్రేశ్వరా" అని ఊతపదం మాత్రం కొడుకు చెబుతుండగా, గురులింగం పాటమాత్రం పాడుకుంటూ పోయాడు.

"ఒళ్లెల్లాను విభూదితో భద్రేశ్వరా!
వాలాలాడెను పరమశివుడు భద్రేశ్వరా!
జడజడానా కోటివేలు భద్రేశ్వరా!
చంద్రకాంత శివలింగాలే భద్రేశ్వరా!
దినదినమునూ రామురాము భద్రేశ్వరా!
అనుదినమునూ రామురాము భద్రేశ్వరా!
ఏడాదికి ఒక్కదినము భద్రేశ్వరా!
వేడుకైన సంకురాత్రి భద్రేశ్వరా!
తరమునాటి తమపెద్దలు భద్రేశ్వరా!
ఎదురుచూచే వేశలయ్యా భద్రేశ్వరా!"

గురులింగం దాదాపు అరగంటసేపు పాట పాడాడు. పాడుతూ మధ్యమధ్య శంఖం పూరించి గంట మ్రోగించాడు. నాన్నగారు అమ్మని పంచలు తెమ్మని, వాటికి పసుపూ కుంకుమపెట్టి గురులింగం చేతపెట్టారు-గురులింగం, "హరహర మహారాజేశ్వరా, పుత్రపౌత్రాభివృద్ధి గలిగి, అందలంపాలకీలు కలిగి, అమృత మహాలక్ష్మికృప అమరంగ కలిగి," అంటూ మళ్ళీ ఏదో దండకంలాంటి వచనం మొదలెట్టాడు.

పాటలు, వచనాలు పూర్తిఅయిన తర్వాత నాన్నగారు "నిరుటికీ, ఈసారికీ బాగా చిక్కిపోయావు గురులింగం," అన్నారు.

"ఇంకే ముందండీ! కథంతా అయిపోవస్తోంది. ఆ సాంబమూర్తి నాకెప్పుడో కన

రాలేదు," అన్నాడు గురులింగం.

"ఏంమాటల్లే గురులింగం! నువ్వింకా పదికాలాలపాటు చల్లగా బ్రతుకుతావు. ఐనా ఇప్పుడు, నీకేం కొఅవైంది? కొడుకులు నీకేం తక్కువ చేయడంలేదు గదా", అన్నారు నాన్నగారు.

"అట్బే లేదండీ! నాకొడుకులు నేను గీచిన గీటు దాటరు. వీడు పెద్దవాడు. వీడికంటే చిన్నవాళ్లు నలుగురున్నారు. అందరూ చేతికెదిగి, మడిచేసుకుంటున్నారు. కుక్కకు టెంకాయబ్బినట్టు నాకు మడీమెట్టా ఏడెనిమిదెకరా లబ్బినాయ్. ఆ ఆసరా చూచుకుని కుర్రాళ్ళు కులవిద్యకే ఎసరుపెట్టేయాలనుకుంటున్నారు."

తనకెవరో తాంబూలంపెట్టి పిలిచినట్టు అన్నయ్య అక్కడ స్వయంగా కలుగజేసుకుంటూ, "లేకుంటే ఏడెనిమిదెకరాల సేద్యముండగా ఇంకా భిక్షాటనం తిరగడమేం కర్మం?" అన్నాడు.

"జంగందేవరలకు భిక్షాటనమే కులవిద్య చిన్నబాబుగారూ! పరవిద్య లెన్నియైనను, కులవిద్యకు సాటిరావన్నారు" అన్నాడు గురులింగం.

"కాలం మారిపోయింది. జంగాలకు మునుపున్నట్టుగా గౌరవంలేదు. ఏమైనా నాన్నగారిమాట తోసివేయలేక ఆయన వెంటబడి తిరుగుతున్నామండీ!" అన్నాడు గురులింగం కొడుకు.

తరువాత గురులింగం మా కుటుంబానికి సంబంధించిన విషయాల్ని ప్రస్తావించాడు. చనిపోయి స్వర్గంలోవున్న మా తాతయ్యని తలచుకుంటుండగా, అతని కంఠం గద్గదికమైంది. వ్యాపారం చేసుకుంటూ పట్నంలో స్థిరపడిపోయి, స్వగ్రామాన్ని మరచిపోయిన మా చిన్నాన్నగారిని గురించి మాట్లాడుతూ మనుషుల్లో బంధుప్రేమ తగ్గిపోతోందని అతడు నిట్టూర్చాడు. ఆతరువాతి ప్రసంగం మా అన్నయ్యవైపు తిరిగింది.

"పెద్దబ్బాయిగారి చదువు పూర్తయినట్టే కదండీ!"

"అయినట్టే మరి! వుద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాడు. దూరా భారంగా వెళ్తేగానీ వుద్యోగం దొరికేట్టులేదు," అన్నారు నాన్నగారు.

"వుద్యోగం మనం కూచున్నచోట దొరుకుతుందా మరీ" అన్నాడు అన్నయ్య!

"దొరక్కపోతే, పోనీలే! మనకు వుద్యోగాలు, ఊళ్ళేలడాలు అక్కర్లేదు. వున్నవాళ్ళందరూ ఒకచోట వుంటే చాలు" అంది అమ్మ.

"అమ్మగారు మంచిమాట చెప్పారు" అంటూ గురులింగం నాన్నగారివైపు చూస్తూ "ఐతే అబ్బాయికి సంబంధా లేమైనా చూస్తున్నారాండీ" అన్నాడు.

"అదొక్కటే తక్కువ," అన్నయ్య గొణుక్కున్నాడు.

"వాడికేమో మేనరికముంది. అమ్మాయికి కూడా తగిన సంబంధం చూచి రెండు కార్యాలూ ఒకేసారి చేసేయాలనుకుంటున్నాను" అన్నారు నాన్నగారు.

* * *

"మంచిదే. అలా చేసేయండి," అంటూ మేము చేసినవి, చేయబోయేవీ అన్నీ మంచి పనులక్రిందే జమకట్టి, గురులింగం మా నాన్నగారి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

పదేళ్ళు గడచిపోయాయి. కాలం మా కుటుంబంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. మన్యపుజ్వరంతగిలి నాన్నగారు హఠాత్తుగా చనిపోయారు. ఆయన చనిపోయిన నాలుగురోజులకు పండుగనెల ప్రారంభమైంది. ఆ తరువాత వారందినాలకు గురులింగం మావూరొచ్చాడు. కానీ పర్వతాల సాంబశివుడు ఆ సంవత్సరం మా వాకిటకి వచ్చి నిలబడలేదు. అంటూ సొంటూ తగిలిన ఇళ్ళల్లో ప్రవేశించగూడదని జంగందేవరల నియమమని తరువాత తెలిసింది. ఐనా, గురులింగం వీధిలో నిలబడి, "అమ్మగారూ!" అని కేకవేశాడు. అమ్మ తలుపు వెనుక నిలబడి, "ఏం గురులింగం అంది."

"మనిషెలాటివాడైందీ చచ్చేనాటికి తెలుస్తుందన్నారు. పెద్ద బాబుగారు పుణ్యాత్ములు. రోగం, రొష్టూ లేకుండా వున్నట్టుండి కళ్ళు మూసేశారు. అలాటి చావు అందరికీ రమ్మంటే రాదు. నేనూ వున్నాను. పదిబారలు నడవడానికి ఓపికుండడంలేదు. చూపు బాగా తగ్గిపోయింది. బాబుగారిలాంటి మహారాజులుండి నాలాటివాళ్ళు పోతే, లోకాని కేమీ నష్టంలేదు. ఏం చేద్దాం తల్లీ! మంచివాళ్ళు త్వరత్వరగా దాటుకుంటారు. మనం గుండె రాయిచేసుకోవాలి. లేకుంటే పిల్లలు దిగులుపడిపోతారు."

ఆ తెల్లవారుఝామున, పాలిపోతున్న వెన్నెల్లో నేను స్వప్నంగా చూచాను. గురులింగం కళ్ళల్లోంచీ కన్నీటి చుక్కలు టపటప నేలరాలినాయ్.

హైస్కూల్లో చదువుకుంటూ పట్నంలో వుండిపోయినందువలన తరువాత ఐదారేళ్ళు నేను గురులింగాన్ని చూడ్డం సంభవించలేదు. గడచిన సంవత్సరం పరీక్షలకు రెండు నెలలు ముందుగా క్రిస్‌మస్, సంక్రాంతి సెలవులు రెండూ కలిసివచ్చాయి. ఎప్పటిలాగే ఒకానొకనాటి సాయంకాలం గురులింగం నడివీధిలో శంఖం పూరించాడు. గురులింగం నానాటికీ జవసత్వాలుడిగి ముసలి వగుగా మారిపోతున్నమాట నిజమే! కానీ ఆ శంఖధ్వానంలో మాత్రం మార్పులేదు. వేషంలోనూ అంతే! అవే విభూదిపట్టెలు, అదే గంట, అదే శంఖం, మెడలో అదే శివలింగం!

తోట దగ్గరినుంచీ వస్తూ, నడివీధిలో జనం మధ్య నిల్చున్న గురులింగాన్ని చూచాను. అతడి ఆకారం కళ్ళబడగానే, "ఇదే ఆఖరుసారి. ఇక గురులింగం నీకు కనబడడు" అని ఏదో ఆకాశవాణి నా చెవుల్లో వూదినట్టయి నిర్ఘాంతపడిపోయాను. అవును! రాలిపోవడమే శుష్కపత్రాల స్వభావం! కానీ, గురులింగం మాకు కేవలం ఒక వ్యక్తి మాత్రుడు కాడు. ప్రాచీన జనపథాల్లోని సంఘవ్యవస్థ తాలూకు ఒక సంప్రదాయమే మూర్తిగా రూపొందినవాడు గురులింగం. జంగాలు యేడాది కోరోజు తమకుల వృత్తిని మననం చేసుకుంటూ భిక్షాటనం బయల్దేరడం కొందరికి దుస్సాంప్రదాయంగా గోచరించినా గోచరించవచ్చు. అది సత్సంప్రదాయమని వాదించవలసిన అవసరం కూడా నాకు కనిపించడంలేదు. అదెలాటి సంప్రదాయమైనా, గురులింగంతోబాటూ మరుగున పడిపోనున్న మాటమాత్రం నిజం!

ఆరోజురాత్రి గురులింగం తమకులం పూర్వప్రశస్తిని కొంత మా అమ్మతో చెప్పాడు. "అమ్మగారూ! రోజులు మారిపోయాయి; మేము వీరశైవులం. మా తాతయ్య చెప్పేవాడు. ఒకప్పుడు మా వీరశైవ మతానికి ఈ తెలుగుగడ్డలో ఎదురుండేదికాదట. మా ఇంట్లో ఇంకా ఒక పాత తాటాకుల కట్టవుంది. దానిపేరు బసవపురాణం. అందులోనూ వీరశైవుల్ని గురించి వివరంగావుంది. మా మతానికి మూలవిరాట్టు బసవేశ్వరుడు కులాలే లేవు పొమ్మని ఢంకా బజాయించి చెప్పేశాడు. లేకుంటే మనుషుల్లో ఇన్ని కులాలెందుకు? ఆయన మాబాగా సెలవిచ్చాడు..."

అక్కడ మా అన్నయ్య అడ్డొచ్చి "మీ బసవేశ్వరుడు గొప్ప అభ్యుదయ వాదిలా వున్నాడే గురులింగం," అన్నాడు.

అభ్యుదయ మంటే ఏమిటో, అభ్యుదయ. వాదులంటే ఎవరో గురులింగానికి తెలిసినట్టులేదు. అతడు కొంతసేపు ఆలోచించి, "ఏమిటో బాబూ! మీమాటలు మాకు అర్థం కావు," అని ఉపోద్ఘాతాన్నంతటితో విరమించి శంఖంపూరించి తన పాటందుకున్నాడు.

గురులింగం పాట నేను చిన్నప్పటి నుంచీ వింటున్నాను. అతడు మొదటిసారి ఎలా పాడాడో. అప్పుడూ అలాగే పాడాడు. ఉచ్చారణలోగానీ, రాగంలోగానీ, మార్పులేవు. నేను కొత్తట్యూనుల కోసం విహ్వలించిపోయే నాగరిక ప్రపంచాన్ని 'బాయ్‌కాట్' చేసినవాణ్ణేమీ కాను. ఐనా, గురులింగం పాటలో ఏదో ఒక ఆకర్షణ ఊహకు అందీ అందని కులగిరుల గాంభీర్యంలా నన్ను తనవైపుకు లాక్కునేది. ఈ రోజుల్లో వెనుకచూపు క్షంతవ్యం కాదనాకు తెలుసు. ఐనా పాట వింటూ నేను గతించిన శతాబ్దాల చీకటితెరలను చీల్చుకుని బసవేశ్వరుడి, పండితారాధ్యుడికి చెందిన పాల్కురికి సోమనాథుడికాలానికి వెళ్ళిపోయినట్టుండేది.

ఆశీర్వచనాలు పూర్తయిన తర్వాత గురులింగం తన మామూలు ప్రకారం మా కుటుంబం గొడవల్లో జొరబడ్డాడు. అప్పటికి మేము రెండుమూడు సంవత్సరాలతరబడి ఒకటిరెండు భీకర సమస్యల్ని పరిష్కరించుకోలేక సతమతమౌతున్నాం. అక్కయ్యకు పెళ్ళయింది. అయిందన్నమాటే గానీ, అది పట్టుమని పదిరోజులు అత్తగారింట్లో కాపురం చేయలేదు. కారణం నే నెంత తరచి అడిగినా అమ్మ దానికీ దాని మొగుడికీ పొంతన కుదరలేదని చెబుతుంది! పొంతనాలు కుదిరి అది కాపురాని కెప్పుడు వెళ్తుందో నామట్టుకు నాకు అనూహ్యమై వుండిపోయింది. దాని విషయమలావుండగా, అన్నయ్య తనకు ససేమిరా పెళ్ళివద్దంటే వద్దంటున్నాడు. అవతలివైపున మా మామయ్య ఈడొచ్చిన బిడ్డని ఎంతకాలమని అట్టేవుంచుకోనని గోల చేస్తున్నాడు. ఒకరిద్దరు పెద్దమనుషులు అన్నయ్యకు నచ్చజెప్పలేక ఆపిల్లను తెచ్చి నాకే అంటగట్టేయాలని ఈమధ్య ఎత్తులువేశారు. 'చచ్చాన్రా బాబూ!' అనుకున్నాను. ఆ అమ్మాయి నాకంటే పదిరోజులు పెద్దది!

"ఐతే చిన్నబాబు గారికేమీ మెత్తబడటం లేదా అమ్మగారూ," అన్నాడు గురులింగం.

"ఊహు. వాడేం చిన్నవాడా గురులింగం! వాడంతకు వాడే ఆలోచించుకోవాలి. నాకు మునుపటిలా వంటలూ వార్పులు చేయడానికి ఓపిక చాలడం లేదు. మా అన్నయ్య ఎప్పుడెప్పుడని ఉత్తరాలపైన ఉత్తరాలు వ్రాస్తున్నాడు," అంది అమ్మ.

"కాలం కలిసివస్తే, అన్నీ జరిగిపోతాయమ్మగారూ! వచ్చే పండగనెల కల్లాఅబ్బాయికి పెళ్ళవుతుంది. అమ్మాయి కాపురానికి వెళ్తుంది," అన్నాడు గురులింగం.

ఏనమ్మకంతో గురులింగం అలా చెప్పాడో నాకు తెలియదు. కానీ ఆరునెలలకల్లా అతడిమాటలు అక్షరాలా నిజమయ్యాయి. కానీ ఈ సంవత్సరం పండుగనెల ప్రారంభమయ్యే సరికి ఆకఠోర వార్త కాస్తా మా ప్రాంతమంతటా గుప్పుమని వ్యాపించిపోయింది. అన్నయ్యకు పెళ్ళయింది. అక్కయ్య బావతో లక్షణంగా కాపురం చేసుకుంటోంది. కానీ ఈ శుభవార్తలు వినడానికి గురులింగం లేడు. మమ్మల్ని దీవించడానికి సంక్రాంతి శంఖం ఇకరాదు! ★